# అమ్మకడుపు చల్లగా - 2

## - గొల్లపూడి మారుతీరావు



స్వర్గీయ గొల్లపూడి మారుతిరావుగారి ఆత్మకథ 'అమ్మకడుపు చల్లగా' ఇప్పటికి పదకొండు సంవత్సరాలుగా మార్కెట్‌లో ఉన్న సంగతి పాఠకులకు విదితమే. అందులో మారుతిరావుగారు 2007 వరకూ తన జీవితంలో జరిగిన సంఘటనలను అత్యంత ఆసక్తికరంగా పాఠకులకు అందించారు. దానికి కొనసాగింపుగా 2007 నుంచి తనజీవితంలోని ముఖ్యమైన సంఘటనలను, క్రిందటి సంవత్సరమే, వ్రాయడం ప్రారంభించారు. అనారోగ్యకారణాలవల్ల దాన్ని పూర్తిచేయలేకపోయారు. ఆయన వ్రాసిన కొద్దిపేజీలను వ్రాసిన వెంటనే, 20ఆ8 నవంబర్‌లో, కౌముదికి పంపించారు. పూర్తిచేసి ఉంటే ఆ పుస్తకానికి ఏమి పేరు పెట్టి ఉండేవారో! ఆ అసంపూర్తి రచనను అమ్మకడుపు చల్లగా - 2 గా కౌముది పాఠకులకు ఈ నెల నుంచి ధారావాహికంగా అందిస్తున్నాం.

*(గత సంచిక తరువాయి)*

**కాలం గడిచినా** కాలదోషం పట్టని కొన్ని సంఘటనల్ని ఇలాంటప్పుడయినా గుర్తుకు తెచ్చుకోవడం సమంజసం.

నేను ఆంధ్రప్రభ చిత్తూరు విభాగంలో పనిచేసే రోజుల్లో పచ్చగా నిలిచిన జ్ఞాపకం, ఎప్పుడూ గుర్తుకు వచ్చే ఆత్మీయతా తెలుగు దేశానికి 'జాతీయగీతం' అనదగ్గ గీతాన్ని రచించిన శంకరంబాడి సుందరాచారి పరిచయం. అతి తరుచుగా చిత్తూరు వచ్చి మాతో గడిపి వెళ్ళేవారు.

మనిషి వెన్నముద్ద. కానీ పట్టుదలకి వస్తే గొప్ప అహంకారి, మొదట్నుంచీ స్వేచ్ఛాయుత జీవి. చిన్నతనంలోనే ఇంటినుంచి బయటకు వచ్చేసి రైల్వే కళాసీగా, బస్సు స్టాండులో కూలీగా, హోటల్లో సర్వర్‌గా పనిచేసి పొట్టనింపుకున్నారుగాని ఒకరిని ఆశ్రయించినవారు కాదు. ఏ రోజుకారోజు గడవడమేకాని పైసా మిగుల్చుకోవండం తెలీని మనిషి. కళకి ప్రాణం యిచ్చే ఉదాత్తుడు. మేం చిత్తూరులో ఉన్న రోజుల్లోనే చేతిలో పైసా నిలవని ఈ కవీంద్రుడు ఆనాటి ప్రముఖ విద్వాంసులు, తిరుపతి సంగీత కళాశాల ప్రిన్సిపాలు అయిన చిత్తూరు సుబ్రహ్మణ్య పిళ్ళైకి చిత్తూరు నడిరోడ్డుమీద సభ జరిపి, స్వయంగా కాలికి గండపెండేరం తొడిగి వారి పాదాల మీద శిరస్సు ఉంచి సాష్టాంగపడడం నాలాంటివారికి అబ్బురమైన దృశ్యం. ఆనాటి సభని, ఓ కళాకారుడి సన్మానాన్ని అప్పటి ఆంధ్రప్రభ న్యూస్ ఎడిటరు జి.కృష్ణగారు మరునాడు పతాక శీర్షికని చేశారు. ఆయనొక రివొల్యూషనరీ.

తేటగీతి, ఆటవెలది సుందరాచారిగారి సొత్తు. తేనెలొలుకుతూ తెలుగుకి అలంకారంగా నిలిచేవి. కొందరు సాహితీపరులు పెంచిన పుష్పవనమైనా ఒక్క పుష్పమే రాణింపుకు వస్తుంది. ఒకానొక సినిమాకి ఆయన "మా తెలుగు తల్లికి మల్లెపూదండ" పాటని రాశారు. తీరా సినిమాలో ఆ పాట బయటికి రాలేదు కానీ, ఆ పాట తెలుగు తల్లికి సుమహారమై, చిరస్థాయిగా నిలిచింది. ఎప్పుడు ఏ సభలో ఆ పాట విన్నా నాకు దాని మాధుర్యం మాత్రమే గుర్తుకు రాదు. సుందరాచారి గుర్తుకు వస్తారు. ఆ రోజుల్లోనే ఆయన రాసిన 'నా

స్వామి' అనే చిన్న పుస్తకాన్ని నాకిచ్చారు. ఇది తేలికగా 58 సంవత్సరాల కిందటిమాట. ఇన్ని సంవత్సరాలు నా దగ్గర భద్రంగా ఉంది. పాకెట్ సైజులో ప్రింటయిన 44పేజీల పుస్తకమది. "నా స్వామి" (తిరుమల యాత్ర)లో నూరు పద్యాలు నూరు ద్రాక్షలు.

ఇందుకు ఇద్దరు మహానుభావుల కితాబు ఉంది. ఇద్దరూ అఖండులు. ఒకాయన రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు. (విచిత్రంగా ఆయన నాకు తెలుసు. తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహించే నాటక పోటీలలో నేను 'అనంతం' నాటికతో పాల్గొన్నాను. బహుమతి ప్రధానోత్సవం నాడు ఉపన్యాసం ఇచ్చినప్పుడు, వేదిక దిగాక నన్ను మెచ్చుకున్న సహృదయులు శర్మగారు.)

వారు 'నా స్వామి'ని మెచ్చుకుంటూ ఒక తేటగీతిని వ్రాశారు.

హృదంతరమున కలుగు నిర్వేదంబు

విలువ నీవె యెఱుగ గలవు; నిన్ను

జొక్కి పల్కరించు సుందరకావ్యమ్ము

దీని జిత్తగించు శ్రీనివాస

మరొక కవి - ఉత్త కవికాదు కవి సామ్రాట్. మెరమెచ్చాలకు మాట తూలే మనిషికాదు. ముఖప్రీతికి భుజం తట్టేమనిషికాదు. ఆయన విశ్వనాథ సత్యనారాయణగారు ఆయన రెండే రెండు వాక్యాలు చెప్పారు. "స్వామి వచ్చి మీ గుండెలో కూర్చున్నట్లున్నది వేసంగిలో కుండలోని చల్లని నీళ్ళలో వట్టివేళ్ళు వేసి సాయమందించినట్లున్నది"

విశ్వనాథవారిని తెలిసినవారికి ఇది మనఃపూర్వకంగా చెప్పిన మాటలు.

మచ్చుకి ఈ శతకంలోని ఒకే ఒక పద్యం - మొదటి పద్యం.

క్షేత్రరాజమగుచు చెలువారు తిరుపతి

పురములోన శేషగిరి తటాన

కాపురమ్ము చేయు కాలశక్తి

నాదు చిత్తమంది కొనుము శ్రీనివాస

కాలశక్తి గురించి ఒక రోజంతా చెప్పారు సుందరాచారిగారు. ఆయన శ్రీ వైష్ణవులు, ఈ ప్రాంతపు వైష్ణవానికి ప్రతీక. ఆయన చెప్పిన విషయాలు మరెవరూ చెప్పలేనివి. మన ఊహకయినా రానివి.

2009లో సాక్షి ఆదివారం సంచిక 'ఫన్‌డే'లో కాలమ్ రాస్తూ ఈ వివరాల్ని ఉటంకించి, ప్రచురణ కర్తల్ని ఊరించాను. "అప్పటికి 49 సంవత్సరాల కిందటి ఈ పుస్తకం బహుశా ఎవరి దగ్గరా ఉండి ఉండదు. నా దగ్గర మాత్రమే ఉంది. ప్రచురణకు కోరితే ఆనందంగా ఇస్తాను. ఊరికే కాదు వందకాపీల లంచం తీసుకుని" అని రాశాను.

వెంటనే చాలామంది స్పందించారు. 2009 జూలై పన్నెండు సంచికలో గుంటూరు నుంచి లక్ష్మీనరసింహ శాస్త్రి అనే ఆయన ఉత్తరం రాశారు. "దానిని తిరుమల తిరుపతి దేవస్థానం ముద్రిస్తే వందకాపీలు లంచంగా తీసుకుంటానన్నారు. మారుతీరావుగారికి చేసే విన్నపమేమంటే నేను వంద కాపీల లంచం ఇవ్వను. ఆ పనిని నాకప్పగిస్తే 200 కాపీలు యిస్తాను. (ఉచిత పంపిణీ నిమిత్తం)"

ఈ శతకం పదిమంది చేతికి రావాలన్నదే నా కోరిక. అలా పెద్ద యెత్తున పదిమందికి చేర్చగల స్తోమతూ, తాహతూ గల సంస్థ తిరుమల తిరుపతి దేవస్థానం. దాదపు 50 సంవత్సరాలు ప్రాణం పోసుకు నిలిచిన మహాకవి శతకం ఒక్క కాపీ - మరింతకాలం భక్తుల చేతుల్లో నిలవాలని నా తాపత్రయం.

నా విజ్ఞప్తికి తిరుమల తిరుపతి దేవస్థానం స్పందించింది. మిత్రులు, దేవస్థానం ప్రచురించే 'సప్తగిరి' పత్రిక సంపాదకులు శైలకుమార్‌గారు ఫోన్ చేశారు. "ఎగ్జిక్యూటివ్ ఆఫీసరుగారు మారడం వల్ల నిర్ణయం ఆలశ్యమయింది. దయచేసి పుస్తకం పంపండి" అని.

''నేను మీ పిలుపుకోసమే ఎదురు చూస్తున్నాను'' అంటూ ముందుమాటని రాసి పంపాను.

అందులో చివరిమాట ''జిజ్ఞాసువులు, భక్తులు, సాహితీ ప్రియులు అందరి చేతుల్లోకి ఈ పుస్తకం రావాలన్నదే నా కోరిక ఇన్నాళ్ళకు తీరింది. ఇది తెలుగుల గుండెల్లో మరో 50ఏళ్ళు బతుకుతుంది.''

దేవస్థానం ఈ శతకం 5,000 కాపీలు ముద్రించింది.

1958 డిసెంబరు. ఆంధ్రావిశ్వవిద్యాలయంలో చదువుకుంటున్న రోజులు. జీవితం చలాకీగా, హుషారుగా సాగుతున్న రోజులు. ఒకపక్క చదువు మాగన్ను పెట్టినా అభిరుచి వేళ్ళుదన్ని బలపడుతున్న రోజులు. విశ్వవిద్యాలయంలో రిజిస్ట్రార్ కె.వి.గోపాలస్వామి గారి ప్రోత్సాహంతో విజృంభించి నాటకాలలో 'ఉత్తమ నటుడు' అనిపించుకున్నాను. అయిదవ అంతర్ విశ్వవిద్యాలయ యువజన సదస్సు (ఇంటర్ యూనివర్శిటీ యూత్ ఫెస్టివల్)కి ఎంపికయాను. ఆంధ్రా విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలల నుంచి వచ్చిన వివిధ శాఖల కళాకారులను ఎంపికచేసి ఒక గ్రూపుగా ఢిల్లీ పంపించారు. (మా బృందానికి పెద్ద న్యాయశాఖ రీడర్ బి.ఎన్.మూర్తిగారు) మేం ప్రదర్శించిన నాటిక భమిడిపాటి రాధాకృష్ణ రచించిన ''మనస్తత్వాలు''. ఇందులో నాతోపాటు విజయవాడ ఎస్.ఆర్.ఆర్, సి.విఆర్ కాలేజీనుంచి వచ్చిన అమృతలింగశాస్త్రి, అత్తిలి కృష్ణారావుకాక, గుంటూరు కాలేజీనుంచి వచ్చిన ఉషారాణి, విజయవాడనుంచి వచ్చిన జయలక్ష్మి నటించిన గుర్తు.

ఢిల్లీలో ఉన్న వారం పదిరోజుల్లోనూ మమ్మల్ని ప్రధానమంత్రి నివాసానికి తీన్ మూర్తి హౌస్‌కీ, రాష్ట్రపతి నివాసానికి తీసుకువెళ్ళి విందు జరిపి ఫోటోలు తీయించారు. అవి చాలా విలువయిన జ్ఞాపికలు. రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్ గారి దగ్గరికి వెళ్ళినప్పుడు వారితో వి.కె కృష్ణమీనన్, గవర్నర్ శ్రీమాలి ఉన్నారు. ఆ ఫోటోల్లో వారూ ఉన్నారు.

ఆ ఫోటోని ఈ 60 సంవత్సరాలలో కొన్ని డజన్ల సార్లు చూసి ఉంటాను. ఎన్నో చోట్ల ప్రచురితమయాయి. కానీ చాలామంది స్పృహలోకి రాని ఆలోచనలు ఆ ఫోటోని ఎప్పుడు చూసినా నన్ను పలకరిస్తాయి.

అప్పుడు నా వయస్సు పంతొమ్మిదేళ్ళు. నాతో ఆ గ్రూపులో నిలబడిన చాలామంది వయస్సులూ దాదాపు ఆ సమీపంలోనే ఉండి ఉంటాయి. ఆ వయస్సులో విశ్వవిద్యాలయంలో పెద్ద చదువులు చదువుకుంటూ తమ రంగంలో తలమానికంగా నిలిచిన వీరు తరువాతి కాలంలో ఏమయివుంటారు? ఈ ఆలోచన వచ్చినప్పుడల్లా మనస్సు కలుక్కుమనే రెండు జీవితాల కథలు జ్ఞాపకమొస్తాయి. ఫోటోలో అందరూ ఆనందంగా, ఉత్సాహంగా కనిపిస్తున్నారు. భవిష్యత్తు ఆ దశలో మాకెవరికీ తెలియదు. కానీ తన భవిష్యత్తు తెలిసిన ఓ అమ్మాయి మా అందరిమధ్యా ఉంది. మాతో నాటికలో నటించిన ఉషారాణి. ఎప్పుడూ నవ్వుతూ, సిగ్గుతో ఉండేది. ఆమె డాక్టర్ జయప్రదాంబ అనే గుంటూరు ప్రముఖ వైద్యురాలి మేనకోడలు. జయప్రదాంబగారి భర్త కాసరనేని సదాశివరావుగారు నగరంలో చాలా ప్రముఖ వైద్యులు. సాహితీ ప్రియులు. అత్యంత హృదయవిదారకమయిన కథ ఆమెది.

చాలా సంవత్సరాల తర్వాత ప్రముఖ రచయిత, చిత్రకారులు సంజీవదేవ్ తన స్వీయకథ 'తుమ్మపూడి'లో ఈ ఉషారాణిని గురించి రాశారు. ''ఆమె జిజ్ఞాస అపారం. ఆమెదొక విషాద జీవితం. ఆమెకి చిన్నప్పటినుంచీ విపరీతమైన రక్తపోటు ఉండడం వల్ల ఉప్పులేని చప్పిడి ఆహారం ఆమెకి అలవాటు చేశారు. ఆమె వయస్సు 20 సంవత్సరాలలోపే. ఆమె ఎక్కువకాలం జీవించే అవకాశం లేదని డాక్టరు దంపతులకు తెలుసు. ఈ వెలుగుతున్న దీపం ఏ ఘడియనో ఎవరికీ తెలియకుండా ఆరిపోతుందని ఆమెకు తెలుసు.

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments